క్లుప్తంగా

సీపీఎం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా కమిటీ సభ్యులు

కొత్తపల్లి: సీపీఎం మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. కొత్తపల్లిలో సీపీఎం నాయకుడు కాళ్ల నాగేశ్వరావు అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా గుర్రాల అప్పారెడ్డి, సభ్యులుగా కాళ్ల నాగేశ్వరరావు, సీహెచ్ సాంబశివకుమార్, గుర్రాల వెంకటసుబ్బారెడ్డి, అంగర వాసు, లక్ష్మి, జ్యోతి ఎన్నికయ్యారు. అనంతరం మండలంలోని సమస్యలపై తీర్మానాలు చేశారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని, మత్స్యకారులకు వేట నిషేధ భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాము తనిఖీ



సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీలోని ఎరువుల గోదామును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: పట్టణంలోని సుగర్ ఫ్యాక్టరీలో ఉన్న ఓం శాంతి ఎరువుల గోదామును శుక్రవారం సాయంత్రం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. గోదాములో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, విజయవాడ, ఓం శాంతి ఫెర్టిలైజర్స్, లక్ష్మీనారాయణ ఎంటర్ ప్రైజస్‌కు చెందిన స్టాక్‌లను పరిశీలించారు. కంపెనీకి చెందిన ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, స్టాక్‌ను సుమారు రెండు గంటల పాటు పరిశీలించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఏడీ ఎం.రత్నప్రశాంతి గోదాములో ఉన్న ఇన్వాయిస్‌కు సంబంధించి సూచనలు, ఇచ్చారు. ఫ్యాక్టరీ పరిధిలోని ఫోర్టెక్స్ ఎరువులు, పురుగు మందుల షాపును పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ టెక్నికల్ ఆఫీసర్లు ఎం గాయత్రి, విజయలక్ష్మి, పద్మజా రాణి, సామర్లకోట ఏఓ ఐ.సత్య ఉన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


- ఎమ్మెల్యేకు సంఘ నేతల వినతిపత్రం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న 104 సంఘ ప్రతినిధులు

సామర్లకోట: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం అచ్చంపేటలో ఎమ్మెల్యే చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. 104 వైద్య సేవలను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ద్వారా అందించాలని 104 కాకినాడ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు అన్నారు. 104లో పని చేస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. వైద్య సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా కేవలం రూ.60 వేల ఖర్చుతో నిర్వహించి, ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. అలాగే 2020 తరువాత విధుల్లోకి చేరిన డ్రైవరు, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు వైద్య బీమా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వి.ఇందుమతి, జి.పాపారావు, ఎస్‌కే ఖలిష, వి మహేశ్వరి, ఎస్‌కే రేష్మా, సుల్తానా, పి.గోవింద్ పాల్గొన్నారు.

సినిమాలు



పెద్దాపురం

లలితా–1:	జీబ్రా
లలితా–2:	అమరన్
వీరభద్ర:	రణగల్
శోభా:	ఇష్క్
సామర్లకోట	
జయలక్ష్మి–1:	రణగల్
జయలక్ష్మి–2:	దేవకీ నందన వాసుదేవ
విఘ్నేశ్వరా:	మెకానిక్ రాకీ

ఆహారం.. ఆరోగ్యం

- పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం
- తాజా కూరగాయలు, పండ్లు ఆహారం భాగం కావాలని సూచిస్తున్న వైద్యులు
- వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరి

కొత్తపల్లి: మారుతున్న కాలంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే పరిశుభ్రమైన ఆహారం తప్పనిసరి. నాలుగేళ్ల క్రితం కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు సంభవించడంతో మానవుని జీవనశైలి పూర్తిగా మార్పు చెందింది. ప్రజల్లో పరిశుభ్రత, ఆహారంపై చైతన్యం పెరిగింది. ప్రతిఒక్కరూ తాజా ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడాన్ని అలవాటుగా చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని పలువురు ఇంటి పరిసరాల్లోనే కూరగాయలు సాగు చేస్తూ వాటినే వినియోగిస్తున్నారు. కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో సుమారు 100 మందికి పైగా పెరటి సాగు చేస్తున్నారు.

పరిశుభ్రతే రక్ష

వాతావరణంలో మార్పులు రావడంతో ప్రజలు నిత్యం ఏదో ఒక వ్యాధి బారినపడక తప్పడం లేదు. పరిశుభ్రమైన ఆహారాన్ని తినేవారు కాలాలు మారినా వ్యాధుల బారిన పడాల్సిన అవసరం ఉండదని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరసరాల పరిశుభ్రతతో పాటు వ్యాయామం, యోగా, ధ్యానం మంచి ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి

మానవుని జీవనశైలిలో తాజా కూరగాయలు, పండ్లు నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. తీపి పదార్థాలు తక్కువగాను, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రధానంగా పిజ్జాలు, బర్గర్లు, జంక్‌ఫుడ్స్, కూల్‌డ్రింక్స్ వంటికి దూరంగా ఉండాలి. డ్రింక్స్‌కు బదులుగా కొబ్బరి నీరు, మజ్జిగతో చేసే లస్సీ, బటర్ మిల్క్, చెరకు రసం తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

కలుషిత నీటితో రోగాలు

కలుషితమైన నీటిని తాగడం వల్ల ప్రజలు త్వరగా వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయి. కాలాన్ని బట్టి పరిశుభ్రమైన తాగునీటిని తీసుకోవాలి. సాధ్యమైనంత వరకూ గోరువెచ్చని నీటిని తీసుకోవడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఆహారంలో నిత్యం పప్పుధాన్యాలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవడం మంచిది. ఉదయం, సాయంత్రం సమయాల్లో డ్రైఫ్రూట్స్ తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. కాలానికి అనుగుణంగా పండ్లు తీసుకుంటే శరీరంలో రక్త ప్రసరణ బాగుంటుంది.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

భోజనం, అల్పాహారం తినడానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. వేడిగా తింటే ఆహారం రుచి తెలియడమే కాకుండా త్వరగా జీర్ణమవుతుంది. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా జాగ్రత్త పడాలి.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..



మన ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉంది. తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు. మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. శీతాకాలంలో త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి.

సౌజన్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, నాగులపల్లి

మంచి ఆరోగ్యం, రుచి



మా పెరటిలో కూరగాయలు సాగు చేస్తున్నాం. ఎటువంటి మందులు పిచికారీ చేయడం లేదు. సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నాం. ఈ కూరగాయలనే మేము నిత్యం వినియోగిస్తున్నాం. మంచి ఆరోగ్యంతో పాటు రుచిగా ఉంటున్నాయి.

సుభద్ర, గృహిణి, మూలపేట



మూలపేటలో ఇంటి ఆవరణలో సాగు చేసిన కూరగాయలు

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాల అలంకరణలో అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు నెరవేర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కాపు కార్తిక వన సమారాధన

సామర్లకోట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శనివారం కాపు వన సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గీయులు ఈ వన సమారాధనకు హాజరు కావాలన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం రాత్రి కాపు సంఘ ప్రతినిధులు పరిశీలించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ వన సమారాధన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సుమారు పది వేల మంది హాజరవుతారని చెప్పారు.

రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు



ఉప్పాడ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పండితులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో వేంచేసిన చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అన్నాభిషేకం చేశారు. వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించారు. ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించారు.

భారీ అన్న సమారాధన

కార్తీమాసం సందర్భంగా చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉప్పాడ గ్రామం నుంచే కాకుండా కొత్తపల్లి, వాకతిప్ప, అమీనాబాదు తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వస్వామి ఆలయంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు గణపతి పూజ, పుణ్యాహవచనం, సూర్య నమస్కారాలు, మహామృత్యుంజయ హోమం, 21 రకాల ద్రవ్యాలతో స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విశేష అలంకరణలో స్వామివారు

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: మాస శివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. దేవస్థానానికి రూ.2,500 చెల్లించిన భక్తులకు లక్షపత్రి పూజలకు అవకాశం కల్పించారు. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసుకున్న భక్తులకు ఆలయ దీపారాధన సంఘం జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేసింది. పూజల అనంతరం జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు. లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులు వెలిగించగా, మిగిలిన దీపాలను వెలిగించడానికి ఆలయానికి వచ్చిన భక్తులు పోటీ పడ్డారు. డిసెంబర్ ఒకటిన అమావాస్యను పురస్కరించుకుని దీపారాధన సంఘం అధ్వర్యంలో మధ్యాహ్నం పది వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. అదే రోజు రాత్రి కోటి దీపోత్సవం ఉంటుంది. రెండో తేదీన భక్త సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి వెండి జటాఝూటం అలంకరణతో కార్తిక మాస ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు.

శృంగవృక్షంలో స్కూటీ చోరీ

తొండంగి: మండలంలోని శృంగవృక్షంలో స్కూటీ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన దివిలి పాపారావు గురువారం రాత్రి ఇంటి ఆవరణలో స్కూటీని పార్కింగ్ చేసి నిద్రించారు. తెల్లవారేసరికి పార్కింగ్ చేసిన స్కూటీ చోరీకి గురైంది. దీనిపై ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో మండలంలోని సీతారాంపురం, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో కూడా బైకులు చోరీకి గురయ్యాయి. వరుస చోరీలతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ



హాజరైన వివిధ శాఖల అధికారులు

ఎంపీడీఓ శ్రీలలిత

పెద్దాపురం: సమాజంలో ప్రతి ఒక్కరికీ పోక్సో చట్టంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని ఎంపీడీఓ శ్రీలలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి అధికారులకు పడాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీలలిత మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో బాలికలపై లైంగిక దాడులు తీవ్ర మయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై బాలికలకు అవగాహన కల్పించి, చట్టం వల్ల వారికి కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, ఈఓపీఆర్డీ రమణ, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో భీమేశ్వర స్వామి



బాలాత్రిపుర సుందరి అమ్మవారు

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం శుక్రవారం, మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు భక్తుల శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తొలుత గోపూజ నిర్వహించి, స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. తొలి అభిషేకాన్ని తిలకించడానికి భక్తులు క్యూల్లో వేచి ఉన్నారు. స్వామి వారికి నిర్వహించిన తొలి క్షీరాభిషేకం తిలకించడానికి భక్తులు పోటీ పడ్డారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కాలభైరవ స్వామి ఆలయం, ధ్వజ స్తంభం, రావి, జమ్మి, మారేడు చెట్లు, తులసి మొక్క, ఉప ఆలయాల వద్ద దీపాలను వెలిగించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లాకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబు, కుమార్, భాస్కర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం తరఫున ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని భక్తులకు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి నీటితోను, పాలతోను భక్తులు అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఘనాపాటి శ్రీపాద రాజశేఖరశర్మ పర్యవేక్షణలో లక్షపత్రి పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో ఉమా మార్కండేశ్వరుని కల్యాణం



స్వామివారికి నిర్వహిస్తున్న కల్యాణం



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

సామర్లకోట: పట్టణంలోని స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న ఉమా మార్కండేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. కార్తిక మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రతి రోజు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పవిత్ర కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఈ కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రావి, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సుమారు ఎనిమిది వేల మందికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు గిడుతూరి శ్రీనివాసు తెలిపారు.

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- ఆర్వో ప్లాంట్లపై చర్యలకు సభ్యుల డిమాండ్
- వివరాలు చెప్పకుండా బిల్లుల చెల్లింపుపై అసహనం
- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు



అధికారుల పనితీరుపై నిలదీస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

సామర్లకోట: ప్రజలకు అందుతున్న తాగునీరు స్వచ్ఛంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ చర్చను ప్రారంభించారు. గణపతి నగరంలో మున్సిపల్ ఆర్వో ప్లాంట్ ఎందుకు మూసేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పూడికతీత పనులు ప్రారంభించిన సమయంలో బస్సు కాంప్లెక్స్ వద్ద డ్రైన్‌లో పూడిక తొలగించక పోవడం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ బలుసు వాసు ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా అభివృద్ధి పనులపై ఎలా చర్చకు అనుమతిస్తారని ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నేతల హరిబాబు ప్రశ్నించారు. ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సభ్యులకు తెలిపారు. వారం రోజుల్లో మున్సిపల్ ఆర్వో ప్లాంట్లపై చర్యలు తీసుకుంటామని ఏఈ రమేష్ చెప్పారు. మున్సిపల్ కుళాయిల్లో కొన్ని రోజులుగా తాగునీరు ఎన్నడూ లేని విధంగా నురగతో వస్తున్నా ఎందుకు శ్రద్ధ చూపడం లేదని కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాల కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని, ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణ అధికారులతో కలసి పర్యటిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. పట్టణంలో దోమలు పెరిగిపోయాయని, మందులు పిచికారీ చేయాలని పితాని కృష్ణ డిమాండ్ చేశారు.

రెండు అంశాలు వాయిదా

కొత్తూరు కూరగాయల మార్కెట్‌లో షాపుల లీజు అంశాన్ని వాయిదా వేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన షాపుల యజమానులు స్థానికులు కాదని నేతల హరిబాబు ఆరోపించారు. రెవెన్యూ అధికారి శ్యామల ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆ అంశాన్ని వాయిదా వేశారు. మరిన్ని వివరాలతో అజెండాలోకి తేవాలని సూచించారు. షాపులు స్థానికులకే ఇవ్వాలని పితాని కృష్ణ, సేపెని సురేష్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు అంశం చర్చ సందర్భంగా ఏ పనులు, ఎంతవరకు చేశారో వివరణ ఇవ్వాలని సభ్యులు పట్టుపట్టారు. ఎన్ని మోటార్లు వేశారో వివరణ ఇవ్వాలని సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. అయితే ఏఈ నుంచి సరైన సమాధానం లేకపోవడంతో ఆ అంశాన్ని వాయిదా వేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు పార్కులో టెండర్‌లో పేర్కొన్నట్టు పనులు పూర్తి చేయకుండా, బిల్లులు ఎలా చెల్లిస్తారని నేతల హరిబాబు ప్రశ్నించారు. అజెండాలో అంశాలు పొందుపర్చే సమయంలో.. అధికారుల వద్ద సమాధానం ఉండాలని, లేకపోతే ఏదో అంశాన్ని వాయిదా వేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ అంశం గతంలో ఆమోదించినదేనని, కమిషనర్‌తో ఆయా శాఖల అధికారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించారు.

డీఈ గైర్హాజరుపై అభ్యంతరం

ఇంజనీరింగ్ శాఖకు హెడ్ అయిన డీఈ కార్యాలయానికి వచ్చి, సమావేశానికి రాకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. డీఈ కౌన్సిల్ సమావేశానికి రానని సమాధానం ఇచ్చారని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సభ్యులకు తెలిపారు. దాంతో ఆమెపై చర్యలకు సిపార్సు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. అంతకు ముందు మాజీ కౌన్సిలర్ యార్లగడ్డ అక్కిరాజు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రజాహక్కుల ర్యాలీని జయప్రదం చేయాలి



కొడవలిలో ప్రచారం చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

కొత్తపల్లి: విజయవాడలో డిసెంబర్ 4న నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి కాకడ రత్నకుమార్ పిలుపునిచ్చారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో శుక్రవారం ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గంగరాజు, పిల్లా ప్రభుదాసు, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.